

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,87,576లు, బంగారం 6 గ్రాముల 250 మిల్లీగ్రాములు, వెండి 19 గ్రాముల 250 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



స్మార్ట్ వ్యవసాయం అవసరం

సెంచూరియన్ యూనివర్సిటీలో సదస్సు ప్రారంభమైంది. మూడు రోజులు జరగనుంది.

- 8లో



మహోత్సవాలు సమాప్తం

పుష్పుణి మహోత్సవాలు ముగిశాయి. ప్రదర్శనలన్నీ ఆకట్టుకున్నాయి.

- 8లో

అడవిపై.. నెత్తుటి మరక



- ఒడిశా–చత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్
- పెద్ద ఎత్తున మావోలు మృతి
- మృతుల్లో మావో అగ్రనేత చలపతి



అడవిలో మృతదేహాల వద్ద జవాన్లు



అడవిలో మావోయిస్టు మృతదేహం



అడవిలో రాళ్ల మధ్యన మావోయిస్టు మృతదేహం



సంఘటన స్థలంలో మావోయిస్టు మృతదేహం

మల్కన్‌గిరి:

చత్తీస్‌గఢ్ సరిహద్దులోని అడవి దద్దరిల్లింది. మావోలు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పులతో నెత్తుటి ఏరు పారింది. చత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియబంద్ జిల్లా కల్లురిఘట్ అడవిలో మంగళవారం ఉదయం మావోలు, పోలీసులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. అంతకు ముందే కాల్పులు జరిగినా మంగళవారం ఉదయం మాత్రం ఎడతెరిపి లేకుండా బుల్లెట్ల వర్షం కురిసింది. ఘటనలో 14 మంది మావోలు మృత దేహాలు గుర్తించారు. మృతుల్లో మావోయిస్టుల ఒడిశా చీఫ్ సెక్రటరీ చలపతి ఉన్నట్లు గుర్తించారు.

ముగిసిన పోరాట ప్రస్థానం



చిత్తూరు నుంచి శ్రీకాకుళం మీదుగా ఒడిశా వరకు సాగిన చలపతి ఉద్యమ ప్రస్థానం ముగిసిపోయింది. ఎన్నో కీలక ఆపరేషన్లలో మాస్టర్ మైండ్‌గా వ్యవహరించిన మావో అగ్రనేత పోలీసు తూటాకు నేలకూలారు. ప్రతాప రెడ్డి, అలియాస్ రామచంద్రా రెడ్డి ఉరఫ్ చలపతిపై కోటి రూపాయల రివార్డు ఉంది. నాలుగు రాష్ట్రాల పోలీసులకు ఆయన మోస్ట్ వాంటెడ్. సాధారణ ఏరియా సభ్యుడిగా ఉద్యమాన్ని మొదలుపెట్టిన చలపతి ప్రస్తుతం మావోయిస్టు కమిటీ ఒడిశా సెక్రటరీ స్థాయికి ఎదిగారు. ఆయన నెట్‌వర్క్ ఎంత బలమైనదంటే.. చలపతి యువకుడిగా ఉన్నప్పటి ఫొటో తప్పితే ఆయనకు వయసు అయ్యాక ఎలా ఉంటారో పోలీసులకు దశాబ్దాల పాటు తెలియలేదు. కొన్నేళ్ల కిందట పోలీసులకు మావోల దగ్గర దొరికిన ల్యాప్‌టాప్‌లో తన భార్యతో కలిసి ఉన్న చలపతి ఫొటో దొరికింది. అప్పటికి గానీ ఆయన రూపురేఖలు పోలీసులకు తెలియలేదు. 1970లలోనే ఆయన ఉద్యమ ప్రస్థానం మొదలైనా.. 1993లో చిత్తూరు నుంచి వచ్చి ఆంధ్రా–ఒడిశా బోర్డర్ గాలికొండలో ఏరియా సభ్యులుగా మావోయిస్టు పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కటాఫ్ ఏరియాలో 9 పంచాయతీలను చలపతి తన ఆధీనంలో ఉంచుకున్నారు. 2004లో కొరాపుట్ జిల్లాలో పోలీస్‌స్టేషన్‌పై దాడి, 2003లో ధమాన్‌జోడి లోనేల్కో మైన్స్ కంపెనీపై దాడి, మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్‌పై దాడి, చిత్రకొండ సమితిలో సెల్ టవర్ల పేల్చివేత, 2009లో ఆంధ్రా గ్రేహౌండ్స్‌పై చిత్రకొండ జలాశయంలో కాల్పులు, 2011లో కలెక్టర్ వినీల్ కృష్ణ కిడ్నాప్ వ్యవహారంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2018లో ఆంధ్రాలో ఎమ్మెల్యేలపై దాడి ప్రణాళిక కూడా ఆయనదే. తన ప్రాంతంలో బీఎస్ఎఫ్ కదలికలు మొదలయ్యాక తన బేస్‌ను కంధమాల్‌కు మార్చుకున్నారు. మావోయిస్టు పార్టీలోనే అరుణ అనే మహిళా మావోయిస్టును వివాహం చేసుకున్నారు.



మృతదేహాల తరలింపు కోసం వచ్చిన హెలికాప్టర్

పోలీసుస్టేషన్ ముట్టడి



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మైకంచ్ పంచాయతీ సర్పంచ్ మస్తారాం మాఝిపై దాడిని ఖండిస్తూ జిల్లాలోని సర్పంచ్‌లు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు సోమవారం సదరు పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈనెల 16వ తేదీన సర్పంచ్‌పై సోయిల్ కంజర్వేషన్ శాఖ అధికారి కుమార్ నాయక్, అతని అనుచరుడు దాడిచేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు అదేరోజు సాయంత్రం సదరు పోలీస్‌స్టేషన్‌లో కుమార్‌నాయక్‌పై బాధితుడు ఫిర్యాదు చేశాడు. అయితే రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పోలీసుస్టేషన్‌ను ముట్టడించి ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కేకేబీకే కుహరోలను నిలదీశారు. సిల్వర్ ఒక్ ప్లాంటేషన్‌కు సంబంధించిన బిల్లులను చెల్లించాల్సిందిగా సర్పంచ్ అడగడంతో అతనిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పోలీసులు ఆ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని, మరో నాలుగు రోజుల వ్యవధిలో నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, హలువ సర్పంచ్ తమ్మారావు బిడికల నేతృత్వంలో ఈ ఆందోళన జరిగింది.

గూడ్స్ రైలు ఎక్కి వ్యక్తి ఆత్మహత్య



ట్రైన్ పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్న కంద



విద్యుత్ తీగలను తాకడంతో చెలరేగిన మంటలు



ఆస్పత్రిలో కంద మృతదేహం

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ ఐదో నంబర్ ప్లాట్‌ఫారంపై ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలు పైకి ఎక్కి ఒక వ్యక్తి విద్యుత్ తీగలను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన వ్యక్తిని ఆర్‌పీఎఫ్ పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే త్రీవంగా కాలిపోయి గాయాలుపాలైన ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి నువాపడ జిల్లాలోని రాజ్‌ఖరియార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బడముల గ్రామానికి చెందిన నరసింగ్ కంద (55) గా రైల్వే పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం 5వ నంబర్ ప్లాట్‌ఫారంపై ఆగి ఉన్న గూడ్స్ రైలును ఎక్కిన కంద విద్యుత్ తీగలను తాకుతానని కేకలు వేశాడు. ఈ క్రమంలో ప్లాట్‌ఫారంపై ఉన్న ప్రయాణికులు కిందికి దిగిపోవాలని వారించారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ప్లాట్‌ఫారం వద్దకు వెళ్లి ఎంత వారించినా అతని వినకుండా విద్యుత్ వైరును తాకాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఎగిరి పడిపోయాడు. పూర్తిగా కాలిన దేహంతో కిందపడిపోయిన అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. దర్యాప్తు చేపట్టిన రైల్వే పోలీసులు అతడు మతిస్థిమితం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ప్రముఖులు జాతీయ పతాకాలను ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం సమగ్ర జాబితా విడుదల చేసింది. రాష్ట్ర రాజధాని నగరంలో రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. స్థానిక మహాత్మా గాంధీ మార్గంలో ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న రాష్ట్రంలో వివిధ ప్రదేశాల్లో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణలో మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ కటక్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. ఇతర మంత్రులకు 15 జిల్లాలు కేటాయించారు. కేంద్రాపడా, బరంపురం మరియు రౌర్కెలాలో ఆర్డీసీలు త్రివర్ణ పతాకం ఆవిష్కరిస్తారు. మిగిలిన జిల్లాల ప్రధాన కార్యాలయంలో కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

శ్రీమందిరంలోకి మొబైళ్లు వద్దు



శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో మొబైల్ నిషేధ పోస్టర్



శ్రీ మందిరం నలు వైపులా పోస్టర్లు అంటిస్తున్న దృశ్యం



ఒడియా భాషలో మొబైల్ వినియోగం నిషేధం హెచ్చరిక పోస్టర్

భువనేశ్వర్:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న పూరీ శ్రీ జగన్నాథ మందిరం తరచూ వివాదాల్లో చిక్కుకుంటోంది. ఎప్పటికప్పుడు ఈ మందిరం లోపలి దృశ్యాలు, కట్టడాలకు సంబంధించిన సమాచారం సాంఘిక మాధ్యమాల్లో వస్తున్నాయి. ఈ పరిస్థితిపై సర్వత్రా విచారం వ్యక్తం అవుతుంది. ఈ పరిస్థితి నివారణకు ఆలయ నిర్వాహక యంత్రాంగం నడుం బిగించింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులు, పర్యాటకులు, భక్తుల్ని చైతన్య పరిచేందుకు శ్రీ మందిరం నలు వైపుల మొబైల్ ఫోను వినియోగం నిషేధంపై అవగాహన పోస్టర్లు అంటించింది. ఒడియా, ఆంగ్ల భాషల్లో ఈ పోస్టర్లు రూపొందించారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతామని ఈ పోస్టర్లలో హెచ్చరించారు.

పూరీ జిల్లాలో అతిసార మరణాలు

- దయా నది నీరు కలుషితం



అతిసార ప్రభావిత ప్రాంతాల్లో పూరీ జిల్లా ఆరోగ్య యంత్రాంగం సందర్శన

భువనేశ్వర్ : పూరీ జిల్లాలో అతసార వ్యాపించింది. ఇటీవల కాలంలో దీని ప్రభావంతో నలుగురు మృతి చెందారు. ఈ పరిస్థితి తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ యంత్రాంగం ఉలిక్కిపడింది. ప్రభావిత ప్రాంతాలకు పూరీ జిల్లా ఆరోగ్య శాఖ అధికార బృందం తరలివెళ్లింది. నీటి కాలుష్యంతో ఈ దుస్థితి తాండవిస్తుందని ప్రాథమికంగా గుర్తించారు. అతిసార ప్రభావిత ప్రజలు స్థానిక దయా నది నీరుపై పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నారు. ఈ నది నీరు పూర్తిగా కలుషితమై ప్రాణాంతకంగా పరిణమించినట్లు ప్రయోగ శాల పరీక్షల్లో తేలింది. దయా నది నీరు మానవ వినియోగానికి ఎంత మాత్రం పనికిరాదని స్పష్టం చేశారు. ఎటువంటి నిత్య అవసరాలకు ఈ నీటిని వినియోగించవద్దని పూరీ ప్రధాన జిల్లా వైద్యాధికారి (సీడీఎంఓ) రూపభాను మిశ్రా ప్రాంతీయులకు సూచించారు. పూరీ జిల్లా కొణాస్ మండలం గోపీనాథ్‌పూర్, గదీషగొపా గ్రామ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో అతిసారం విస్తరించింది. గత 15 రోజుల నుంచి పలువురు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరుతున్నారు. అతిసార బారిన పడి 4 మంది వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో సీడీఎంఓ స్పందించారు. సీడీఎంఓతో సహా ఆరోగ్య శాఖ అధికారుల బృందం ప్రభావిత గ్రామాలను సందర్శించింది. అతిసార ఆవిర్భావం, వ్యాప్తి కారణాల్ని ఈ బృందం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించింది. గ్రామస్తులు దైనందిన అవసరాలకు దయా నది నీటిపై ఆధారపడుతున్నారు. ప్రయోగశాల పరీక్ష కోసం దయా నది నీటి నమూనాను సిఫారసు చేశారు. ప్రయోగశాల పరీక్షలో దయా నది నీరు అత్యంత కలుషితమైందని, వినియోగానికి సరిపోదని తేలింది. ఈ నదీ జలాలను ఎలాంటి అవసరాలకు వినియోగించవద్దని ప్రజలకు సూచించాం' అని రూపభాను మిశ్రా తెలిపారు. అతిసార ప్రభావిత గ్రామాల్లో పూరీ అదనపు కలెక్టర్ శరత్ చంద్ర బెహెరా, సబ్ కలెక్టర్ రాజ్ కిషోర్ జెనాతో కూడిన బృందం సంయుక్తంగా పర్యవేక్షిస్తుందని సీడీఎంఓ తెలిపారు. ఈ బృందం గ్రామంలో ఇంటింటా డయేరియా వ్యాప్తికి సంబంధించిన వివరాల కోసం సంప్రదించారు. ఈ ప్రాంతంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు విచారం వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు ఆ శాఖ ఏర్పాట్లు చేసింది. అంతేకాకుండా, గ్రామస్తులు గొట్టపు బావుల నీటిని మాత్రమే ఉపయోగించాలని గ్రామస్తులకు తెలిపారు.

ప్రభుత్వం చర్యలు చేపడుతుంది

పూరీ జిల్లా కొణాస్ మండలంలో అతిసార పరిస్థితిపై రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రవి నాయక్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం అతిసార నివారణ, నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. స్థానిక పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు సురక్షిత తాగు నీటి సరఫరా జరుగుతోంది. దయా నది నీటి కాలుష్యంపై త్వరలో చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పూరీ జిల్లాలో ప్రాణాల్ని బలిగొంటున్న అతిసార పరిస్థితిపై బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోగం వ్యాప్తి నివారణ ఇతరేతర ఆరోగ్య జాగ్రత్తల పట్ల ప్రజల అవగాహన కోసం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇంటింటికీ వెళ్లి చైతన్యపరచాలని తెలిపారు.

న్యూస్‌రీల్

రైల్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే అక్కడ ఉన్న సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరించి మంటలను ఆర్పగలిగారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక ప్రెస్ యూనియన్ తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సభ్యులు మంగళవారం సేవా కార్యక్రమాలు చేశారు. ఇందులో భాగంగా స్థానిక హౌసింగ్ బోర్డు వద్ద గల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్షులు అమూల్యరత్న సాహు, కార్యదర్శి శివాజీ దాస్, ముఖ్యసలహాదారుడు సురేష్ దాస్, సభ్యులు పాల్గొన్నారు. త్వరలోయూనియన్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు యూనియన్ కార్యదర్శి శివాజీదాస్ తెలిపారు.

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా



లోయలో పడిన ఆటో

రాయగడ: రాయగడ–కలహండి జిల్లా సరిహద్దు తువాముల్ రాంపూర్ సమీపంలో గల నగరుండి పంచాయతీ మెలెగెరగ గ్రామం ఘాట్ రోడ్డు వద్ద ఆటో బోల్తా పడింది. సుమారు పది మీటర్ల లోయలో ఆటో పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మంది గాయపడ్డారు. తువామూల్ రాంపూర్ పంచాయతీలోని మెలొగెర, సుమెండి, మండిపాదొరొ గ్రామాలకు చెందిన 8 మంది ఆటోలో కళ్యాణసింగుపూర్‌కు మంగళవారం బయల్దేరారు. మెలెగెరగా ఘాట్ రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి పడిపోయింది. దీంతో అటుగా వెళ్తున్న వారు స్పందించి వాహనంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో కళ్యాణసింగుపూర్ ఆస్పత్రికి తరలించారు.

యువకుడు కిడ్నాప్

- రక్షించిన పోలీసులు



కిడ్నాప్‌కు గురైన డొంబు భూమియ

జయపురం: డబ్బుల కోసం ఒక యువకుడిని కొంతమంది కిడ్నాప్ చేశారు. అయితే పోలీసులు పకడ్బందీగా వ్యవహరించి కిడ్నాప్‌నకు గురైన యువకుడిని రక్షించారు. కిడ్నాప్ అయిన వ్యక్తి జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి ఖెందుగుడ డొంబు భూమియగా గుర్తించామని బొరిగుమ్మ సబ్‌డివిజన్ పోలీసు అధికారి తపస్వనీ కువార్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన సాయంత్రం డొంబు భూమియ తన గ్రామ సమీపంలో ఉన్న సమయంలో దుండగులు కారులో వచ్చి అతడిని ఎత్తుకుపోయారు. ఈ విషయం తెలిసిన డొంబు సోదరుడు రామనాథ్ భూమియ బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఈ కేసులో దర్యాప్తు జరిపేందుకు ఒక పోలీసు టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ టీమ్ కిడ్నాపైన యువకుడిని పలు ప్రాంతాలలో గాలించారు. మొబైల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కిడ్నాపర్లు ఎక్కడ ఉన్నారో గుర్తించామన్నారు. బొయిపరిగుడ సమితి రామగిరి సమీపంలో వారిని కనిపెట్టి దాడి చేయగా పోలీసులను చూచిన దుండగులు కారు విడిచి పారి పోయారని వెల్లడించారు. కారులో బంధిగా ఉన్న డొంబులు భూమియను రక్షించినట్లు వెల్లడించారు. దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్డీపీవో తపస్వనీ కువార్ తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధి మండలిలోకి కొత్త సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ ఒడిశా అభివృద్ధి మండలి ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌లో తాజాగా ఇద్దరికి స్థానం కల్పించింది. వీరిలో కొరాపుట్ లోక్‌సభ సభ్యుడు సప్తగిరి ఉలాకా, గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గోమాంగో సభ్యులుగా కొత్తగా నియామకమయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆమోదంతో ఈ నియామకం జరిగింది. రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా శాఖ మంత్రి నిత్యానంద గోండ్ అధ్యక్షతన తొమ్మిదిమంది సభ్యులు, ముగ్గురు ఎక్స్-అఫీషియో సభ్యులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు అయింది. తాజా నియామకంతో టాస్క్ ఫోర్స్‌లో సభ్యుల సంఖ్య 11కి పెరిగింది.

పురపాలక సంస్థ అద్వర్యంలో భీమభోయ్ ప్రత్యేక శిబిరం



చిన్నారికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి పురపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బుటిగూఢ ఉన్నత పాఠశాల ఆవరణలో భీమభోయ్ ప్రత్యేక శిబిరాన్ని మల్కన్‌గిరి పురపాలక చైర్మన్ మనోజ్ బారిక్ ప్రారంభించారు. దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో 342 మంది వైద్య సేవలు పొందారు. వీరికి 267 మందికి దివ్యాంగ సర్టిఫికెట్లు, పది మంది బస్‌పాస్‌లు, ఒక త్రిచక్ర సైకిల్, వీల్‌చైర్‌కు దరఖాస్తులు వచ్చాయి.

ఎమ్మెల్యే స్వగ్రామంలో బాలికపై లైంగిక దాడి

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్వగ్రామం బంటుపల్లిలో ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన నారు ప్రసాద్ అనే 23 ఏళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి సోమవారం జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. బాధిత బాలిక బంటుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. చిన్నతనం, అమాయకత్వం వల్ల విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద దర్యాప్తు చేయగా.. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి యువకుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు ప్రసాద్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా.. అక్కడ రాచమర్యాదలు జరిగినట్లు సమాచారం. కాగా, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్వగ్రామంలోనే ఇటువంటి దారుణం జరగడం సంచలనంగా మారింది. నిందితుడు ప్రసాద్ బంటుపల్లి పంచాయతీలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో తిరుమరెడ్డి సతీష్ అనే కాంట్రాక్టర్ వద్ద ఎన్.ఎం.ఆర్‌గా పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే వీరిద్దరూ యూబీ పరిశ్రమ లో పాగా వేశారు. ఎమ్మెల్యేకు ప్రసాద్ వీరవిధేయుడుగా మెలగడంతోనే పరిశ్రమలో ఉద్యోగం వేయించారని గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు.

స్మార్ట్ వ్యవసాయం అవసరం



స్మార్ట్ వ్యవసాయంపై జాతీయ సెమినార్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్



ఆర్‌సీ అగర్వాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సెంచూరియన్ వర్సిటీ ప్రతినిధులు



జాతీయ వాతావరణ స్మార్ట్ వ్యవసాయంపై జరిగిన సెమినార్ వద్ద సెంచూరియన్ వర్సిటీ విద్యార్థుల ప్రదర్శన

పర్లాకిమిడి: వాతావరణ మార్పుల వల్ల రైతులు స్మార్ట్ వ్యవసాయం నేర్చుకోవాలని, దీని కోసం ఐకార్ ఆధునిక వ్యవసాయ పద్ధతులు ప్రవేశపెట్టిందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, డాక్టర్ ఆర్.సి. అగర్వాల్ అన్నారు. పర్లాకిమిడి సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం జాతీయ క్లైమేట్ స్మార్ట్ అగ్రికల్చర్, సుస్థిరత కోసం సృజనాత్మకత, దత్తత.. అన్న అంశంపై జాతీయ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. దేశంలో సమీకృత వ్యవసాయ విధానం ఎంతో అవసరమని తెలంగాణ కొండారెడ్డి వ్యవసాయ విద్యాలయం, పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ రంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



స్మార్ట్ వ్యవసాయంపై సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

వ్యవసాయ విద్యార్థులు, పరిశోధకులు స్మార్ట్ వ్యవసాయం, డ్రోన్స్, కృత్రిమ మేధస్సు వంటివి అభ్యసించాలని అన్నారు. డాక్టర్ ప్రీతి భద్ర అతిథులను సాదరంగా ఆహ్వానించారు. మూడు రోజుల సెమినార్‌కు దేశంలో15 రాష్ట్రాల నుంచి 402 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 363 పరిశోధన పత్రాలు వచ్చాయి. 40 మంది రిసోర్సు పర్సన్లు విచ్చేశారు. ఈ సందర్భంగా స్మార్ట్ వ్యవసాయంపై జాతీయ సెమినార్‌లో అతిథులు ఒక సావనీర్‌ను విడుదల చేశారు.

నాణ్యమైన విద్య ఎన్‌ఈపీ ధ్యేయం

- ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి
- ఎన్‌ఈపీ అమలుపై వర్క్‌షాపు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



హాజరైన విద్యా నిపుణులు



కొత్త పాఠ్యాంశ పుస్తక ప్రదర్శనలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భువనేశ్వర్: కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) – 2020 అమలుపై మూడు రోజుల జాతీయ వర్క్‌షాప్ మంగళవారం స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కార్యక్రమంలో పాల్గొన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆర్థిక సహాయం, విద్యా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రాష్ట్ర విద్యా రంగానికి అవసరమైన అన్ని సౌకర్యాలను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర, దేశ భవిష్యత్తును మెరుగు పరచడంలో ఇది తప్పక దోహదపడుతోందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త విద్యా విధానం ప్రాథమిక విద్యలో నాణ్యమైన విద్య, మంచి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో 10+2 పద్ధతికి బదులు 5+3+3+4 విధానాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రీ-స్కూల్ విద్యకు ప్రాధాన్యతనిస్తూ పిల్లల కోసం శిశు వాటికా తెరవనున్నట్టు వెల్లడించారు. పిల్లలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రాథమిక, సంఖ్యా నైపుణ్యాలపై దృష్టిని కేంద్రీకరించనున్నట్టు పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో దీని కోసం విస్తృతమైన మౌలిక సదుపాయాలు సృష్టించబడతాయన్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థను మరింత పటిష్టంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం ఆలస్యమైందని విచారం వ్యక్తం చేశారు. 21వ శతాబ్దపు అవసరాల ఆధారంగా రాష్ట్ర విద్యావ్యవస్థను మెరుగు పరచడంలో, దృఢమైన విద్యా వ్యవస్థతో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దడంలో కొత్త జాతీయ విద్యా విధానం ప్రత్యేకంగా సహాయ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్య నాణ్యతను పెంపొందించడంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు రూపకల్పన కోసం ప్రభుత్వం గోదావరీష్ మిశ్రా ఆదర్శ ప్రాథమిక పాఠశాల పథకం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో డ్రాప్ అవుట్ రేటు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 వేలు చొప్పున ఇప్పటి వరకు లక్షా 60 వేల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేసినట్టు పేర్కొన్నారు. దేశ విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడంలో జాతీయ విద్యా విధానం పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. కాగా రాష్ట్రాలలో జాతీయ విద్యా విధానం అమలులో కేంద్రం, రాష్ట్రాల సహకారంతో మూడు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్ ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలోని నైతిక, పరంపర, మౌలిక విలువలపై ఆధారపడిన జాతీయ విద్యా విధానం సృజనాత్మకత ఇమిడిన జాతీయ మనోభావాలతో మానసిక వికాసానికి దోహదపడుతుందన్నారు. దేశం వేగవంతమైన అభివృద్ధి అవసరాలను తీర్చడం, భవిష్యత్తు ఆధారిత విద్యను ప్రోత్సహిస్తుంది.. ఇది విద్యార్థులకు సమానమైన నాణ్యమైన విద్యను నిర్ధారిస్తుంది. వికసిత్ భారత్, ఒడిశా సంకల్ప సిద్ధికి ఈ విద్యా విధానం బలమైన పునాది వేస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు.

కుంద్ర సమితిలో ప్రజాప్రతినిధుల పర్యటన



చోళ్లు కొనుగోలు మండీని ప్రారంభిస్తున్న నాయకులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితిలో మంగళవారం కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు బోత్ర, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝిలు పర్యటించారు. ఈ సందర్భంగా సమితిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. తొలుత కుంద్రలోని సరస్వతీ శిశుమందిరం, విద్యాలయాలను సందర్శించారు. శిశుమందిర కమిటీ సభ్యులతో విద్యాలయ అభివృద్ధిపై ఆరా తీశారు. అనంతరం బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కుంద్ర సమితిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుంద్ర, దిగాపూర్ బీజేపీ మండళ్ల అధ్యక్షులు ధనపతి పొరజ, పద్మనాభ బిశాయి, మండలి బీజేపీ ప్రతినిధి అంబుపాత్రో, డోపాల్ సాబత్‌లతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. వారు సమితిలోలోని సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు కుంద్ర సమితి ఘివ్వరియ గ్రామంలో శ్రీఅన్న యోజనలో ఎం.ఎస్ స్వామినాథన్, బ్రాహ్మన దెయి స్వయం సహాయక గ్రూపు నిర్వహించిన చోళ్ల మండీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండియ రాణి డాక్టర్ రోయిమతి ఘివ్వరియ పాల్గొన్నారు. తొలిరోజున ఎనిమిది మంది రైతుల నుంచి చోళ్లు కొనుగోలు చేశారు. సమితివో చోళ్లు పండించే 112 మంది రైతుల నుండి ఖరీదు చేయాలని నిర్ణయించామన్నారు. క్వింటా 4,290 రూపాయలకు కొనుగోలు చేయాలని నిర్ణయించడంతోపాటు క్వింటాకు రూ. 210 బోనస్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మండీ ప్రారంభ కార్యక్రమంలో భద్రీనారాయణ ఆచార్య, భగవాన్ పండ, ప్రకాశ పట్నాయక్, మిలన్ ప్రధాన్, అభిలాష్ బెహర పాల్గొన్నారు.

వచ్చే నెల 13 నుంచి బడ్జెట్ సమావేశాలు



శాసన సభ భవనం

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 13 నుంచి ఆరంభం కానున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఫిబ్రవరి 17న సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు రెండు దశల్లో 28 రోజులు కొనసాగుతాయి.

ఈ మేరకు మంగళవారం శాసన సభ సచివాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు ప్రకారం 17వ శాసన సభ మూడో సమావేశాలు తొలి దశ ఫిబ్రవరి 13న ప్రారంభమై 21 వరకు కొనసాగుతుంది. రెండవ దశ మార్చి ఏడు నుండి ఏప్రిల్ ఐదో తేదీ వరకు కొనసాగుతుంది. తొలిరోజు గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రసంగిస్తారు. ఫిబ్రవరి 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ జరగనుంది. 16వ తేదీ ఆదివారం సెలవు కాగా, 2025–26 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను 17వ తేదీన సమర్పించనున్నారు. ఫిబ్రవరి 18న అధికారిక పనిదినం, 19న ప్రైవేట్ మెంబర్స్ బిజినెస్, 20, 21 తేదీల్లో బడ్జెట్‌పై సాధారణ చర్చ ప్రారంభమవుతుంది. తదుపరి ఫిబ్రవరి 22 నుంచి మార్చి ఆరు తేదీ వరకు సమావేశాలకు విరామం. రెండో దశలో మార్చి ఏడు నుంచి తిరిగి సభా సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంటల్ స్టాండింగ్ కమిటీ నివేదికలను సభలో ప్రవేశపెడతారు. ఆ తర్వాత మార్చి 10 నుంచి శాఖల వారీగా మంజూరు డిమాండ్లపై చర్చ, మార్చి 29న ఖర్చుల మంజూరు బిల్లు వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నాయి.

వందేభారత్ ట్రైన్ మోడల్‌గా
పాఠశాల తరగతి గదులు



తరగతి గోడ పై వందేభారత్ ట్రైన్ చిత్రం వద్ద ఉపాధ్యాయులు

మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ అప్పనపల్లి గ్రామంలో ఉన్న ఉన్నత ప్రాథమిక పాఠశాల తరగతి గదులను పాఠశాల హెచ్ఎం మంజుశ్రీ మహలీ వందేభారత్ ట్రైన్ మోడల్‌గా చిత్రీకరించారు. స్థానిక గిరిజన బాలలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంతో విద్యార్థులు రైలెక్కి చదువుతున్న అనుభూతి పొందుతున్నారు. – మల్కన్‌గిరి

రైతుల ఆందోళన



ఆందోళనలో రైతులు, ఎమ్మెల్యే ఎంఎల్ఏ గొమాంగో

- ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్
- రైతులకు మద్దతు ప్రకటించిన ఎమ్మెల్యే గొమాంగో

రాయగడ: ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. ఇదే డిమాండ్‌తో జిల్లాలోని పద్మపూర్ సమితి ఖులాముండ వద్ద రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఖరీఫ్ ధాన్యం కొనుగొలుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఖులాముండలో మండీని ఏర్పాటు చేసింది. అయితే సకాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగొలు చేయడం లేదని, కొనుగొలుకు సంబంధించి టోకెన్ల మంజూరులో కూడా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వారంలో కేవలం ఒకే రోజు మాత్రమే మండీ తెరుస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. దీంతో మండీ వద్ద తమ ధాన్యానికి కాపలా కాసుకునేసరికే సమయం సరిపొతుందని రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సొమవారం రైతులు ఖులాముండ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గుణుపూర్ ఎంఎల్ఏ సత్య జీత్ గొమాంగో సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి దశరధి సారేన్ ఆందోళన కారులతొ మాట్లాడారు. వారి సమస్యలను త్వరతిగతిన పరిష్కరించేందుకు హామీ ఇవ్వడంతో రైతులు, ఎంఎల్ఏ గొమాంగోలు ఆందోళన విరమించారు.

పర్లాకిమిడి: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో అధికారులు, మిల్లర్లు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ కాశీనగర్ బ్లాక్ రైతులు కె.సీతాపురం కూడలి వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో పౌర సరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను అనేక ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. మండీలకు ధాన్యాన్ని తరలిస్తే మిల్లుకు పంపాలని మార్కెటింగ్ కమిటీ అధికారులు అంటున్నారని, తీరా మిల్లు వద్దకు ధాన్యం తీసుకెళ్తే ధాన్యం ఎఫ్ఏక్యూ క్వాలిటీ లేదని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ట్రాన్స్‌పోర్టు ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల ఆందోళనతో పర్లాకిమిడి – గుణుపురం– రాయగడ, కొరాపుట్‌కు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాశీనగర్ తహసీల్దార్ దంబురధర మల్లిక్, అదనపు తహసీల్దార్ త్రినాథ సాహు, ఏఆర్‌సీఎస్ హరిహర శెఠి ఆందోళనకారుల వద్దకు చేరుకుని బుజ్జగించారు. చివరకు అసిస్టెంట్ పౌర సరఫరాల శాఖ అధికారి స్నేహాంగిణి బెహరా సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాశీనగర్ పోలీసు ఐఐసీ సునీల్ కుమార్ బెహరా ఆందోళన వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కె.సీతాపురం జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పుష్‌పుణి మహోత్సవాలు సమాప్తం



ఆదివాసీ కళాకారుల డ్యాన్స్



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రష్యా కళాకారులు



పుష్‌పుణి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు



రష్యన్ వాయిద్య పరికరాన్ని వాయిస్తున్న రష్యాకళాకారిణి ఎవెంజినియ



పుష్‌పుణి వేదికపై అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులు

జయపురంలో కొరాపుటియ కళ, కళాకారుల మంచ్ నిర్వహించిన పుష్‌పుణి మహోత్సవాలు కళాకారుల కళానైపుణ్యానికి అద్దం పట్టాయని కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్ అన్నారు. సోమవారం రాత్రి పుష్‌పుణి మహోత్సవాలు ముగింపు సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ఉత్సవాలు ఔత్సాహిక కళాకారులకు స్ఫూర్తినిస్తాయన్నారు. సోమవారం 3 గంటల వరకు జరిగిన నృత్య నాట్య సంగీత కార్యక్రమాల్లో రష్యా కళాకారులు అలగ్జాండర్, అలగ్జాండరియ, ఎవెంజినియాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కొరాపుట్ ఆదివాసీ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. – జయపురం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఆవరణలో వేద పండితులు శంబరి కృష్ణ, దూసి శివప్రసాద్‌లు చండీయాగం నిర్వహించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్, సూపర్‌వైజర్ ఏడుకొండలు పర్యవేక్షించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ప్రసన్నలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: దేశరాజధాని ఢిల్లీలో ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో జిల్లా కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త టి.ప్రసన్న లక్ష్మి ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు కేంద్రం నుంచి ఆమె ఆహ్వానం అందుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ అభియాన్, మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య పథకాల నుంచి అత్యుత్తమ సేవలు అందించిన ఐదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆంధ్రప్రదేశ్ నుంచి రిపబ్లిక్ డే పరేడ్‌కు ఆహ్వానం రాగా అందులో విజయనగరంలోని కొటిశ వీధికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ప్రసన్న లక్ష్మి ఒకరు. అంగన్‌వాడీ కార్యకర్త ప్రసన్నలక్ష్మి తన పరిధిలో 15 ఏళ్ల బాలికకు జరగనున్న బాల్య వివాహాన్ని సీఎంపీఓ బృందంతో కలిసి నిలుపుదల చేశారు. అనంతరం ఆ బాలికను జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ కార్యకర్త చేర్పించారు. బాల్య వివాహాన్ని విజయవంతంగా ఆపడమే కాకుండా మళ్లీ తిరిగి ఆమె చదువును కొనసాగించేందుకు కృషి చేసినందుకు గాను ప్రసన్నలక్ష్మికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. ప్రసన్నలక్ష్మిని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్, ఇన్‌చార్జి పీడీ సుధారాణిలు ఈ సందర్భంగా అభినందించారు.

చెరువులో పడి వ్యక్తి..

విజయనగరం క్రైమ్: స్థానిక ఇందిరానగర్, గోకపేట చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని గాజువాకలో నివాసం ఉంటున్న పోలవరపు సతీష్ (38) కొన్నాళ్లుగా ఆరోగ్యం బాగులేక ఇంటి నుంచి విజయనగరంలోని ఉంటున్న చుట్టాలింటికి వచ్చి సర్వజన ఆస్పత్రికి వెళ్లి చూపించాడు. అక్కడినుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో జనవరి 18న మిస్సింగ్ కేసును వన్‌టౌన్ పోలీసులు నమోదుచేశారు. గోకపేట చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉందని తెలియడంతో మృతుడి బంధువులు అక్కడికి చేరుకుని పరిశీలించి మృతదేహం సతీష్‌దేనని గుర్తించారు. మృతుని భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియా మాత్రల పంపిణీ శతశాతం జరగాలి

విజయనగరం ఫోర్ట్: ఫైలేరియా వ్యాధి నిర్మూలనలో భాగంగా వచ్చేనెల 10 నుంచి 15 రోజుల పాటు గుర్ల మండలంలో డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ శతశాతం జరగాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. మైక్రో ఫైలేరియా కేసుల సంఖ్య గుర్ల మండలంలో ఎక్కువగా బయట పడడంతో ఆ మండలంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వెల్లడించారు. కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్ల మండలంలో సుమారు 16 వేల ఇళ్లు ఉన్నాయని, ప్రతి ఇంటికీ ఫైలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన స్టిక్కర్లను, కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు. మండలంలో 67 వేల జనాభాలో రెండేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మినహా ప్రతిఒక్కరి చేతా డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. దీని కోసం ముందుగానే మండలంలో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా మాత్రలను మింగించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవన రాణి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, డీఎల్‌ఓ డాక్టర్ రాణి, డీఎంఓ మణి, డీఈఓ మాణిక్యంనాయుడు పాల్గొన్నారు.

- సాగు చేసిన పంటల్లో సగం కూడా చెల్లించని బీమా
- 13,198 హెక్టార్లలో మినుము పంట సాగు
- బీమా చెల్లించింది 5,786 హెక్టార్లకే
- పెసర పంట సాగు 5,183 హెక్టార్లు
- బీమా చెల్లించింది 3,384 హెక్టార్లకే
- సొంత డబ్బులు చెల్లించాల్సి రావడంతో వెనుకడుగు

రబీలో సగం పంటకు కూడా చెల్లించని బీమా

రైతులు రబీలో సాగు చేసిన పంటల్లో సగం పంటలకు కూడా బీమా ప్రీమియం చెల్లించలేదు. మినుము పంట 13, 198 హెక్టార్లు సాగవగా 5,786 హెక్టార్లకు మాత్రమే రైతులు బీమా ప్రీమియం చెల్లించారు. అదేవిధంగా పెసర పంట 5,183 హెక్టార్లు సాగవగా 3,384 హెక్టార్లకు పంటల బీమా ప్రీమియం చెల్లించారు.

పంటల బీమాపై రైతుల అనాసక్తి..!

విజయనగరం మండలం పినవేమలిలో సాగులో ఉన్న మినుము పంట


విజయనగరం ఫోర్ట్: కూటమి సర్కార్ ప్రవేశ పట్టిన పంటలబీమా పథకంపై రైతులు అసక్తి చూపడం లేదు. రబీ సీజన్ నుంచి ఉచిత పంటల బీమాకు ప్రభుత్వం మంగళం పాడింది. దాని స్థానంలో రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించుకునే బీమా పాలసీని తీసుకువచ్చింది. పంటలబీమా ప్రీమియం భరించలేక అధిక శాతం మంది రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఇష్టపడడం లేదు. అధికారంలోకి వస్తే రైతులకు అన్ని విధాలా అండగా ఉంటాం. వారికి సంక్షేమ పథకాలను అందిస్తాం అంటూ కూటమి నేతలు గొప్పలు చెప్పారు. కొత్త పథకాల మాట దేవుడెరుగు, ఉన్న పథకాలను కూటమి ప్రభుత్వం ఎత్తేస్తోంది. దీంతో రైతులకు చేతిచమురు వదులుతోంది. రబీలో సాగైన పంటల్లో సగం పంటకు కూడా రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు సాగుచేసిన పంటలకు ఈ-క్రాప్ చేసుకుంటే ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించింది. ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితి.

పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం

పంటల బీమాకు సంబంధింధించి మొక్కజొన్న పంటకు ఎకరాకి రూ. 36 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి రూ. 540 రైతులు చెల్లించాలి. మినుము పంటకు ఎకరాకి రూ.20 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి ఎకరాకి రైతు రూ.300 చెల్లించాలి. పెసర పంటకు సంబంధించి ఎకరాకి రూ. 20 వేలు వర్తిస్తుంది. దీనికి ప్రీమియం రైతు రూ.300 చెల్లించాలి. వరి పంటకు సంబంధించి ఎకరాకి రూ.42 వేలు బీమా వర్తిస్తుంది. దీనికి రైతు రూ.630 ప్రీమియం చెల్లించాలి.

గత ఏడాది రబీలో సాగైన పంటలు

2023-24 రబీలో వరి పంట 422 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 18, 861 హెక్టార్లలోను, మినుము పంట 14,378 హెక్టార్లు, పెసర పంట 5,717 హెక్టార్లలో సాగైంది. వీటికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియం చెల్లించింది.

48 శాతం చెల్లింపు

పంటల బీమా పథకానికి సంబంధించి పెసర, మినుము పంటలకు 48 శాతం పంటల బీమా ప్రీమియం రూతులు చెల్లించారు. మిగతా జిల్లాల్లో కంటే మన విజయనగరం జిల్లాలోనే ప్రీమియం బాగానే చెల్లించారు. వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


రమణమూర్తి మృతదేహం

గంట్యాడ: ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గంట్యాడ మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన మీసాల రమణమూర్తి (31) కొన్నేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో ఒక ఫార్మా కంపెనీలో కెమిస్ట్‌గా విధులు నిర్వహించేవాడు. అనారోగ్య కారణాలతో అక్కడ ఉద్యోగం మానేసి కొన్నేళ్లుగా ఖాళీగా ఉంటున్నాడు. కొద్ది రోజుల క్రితం విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురంలోని ఓ ఫార్మా కంపెనీలో చేరాడు. సంక్రాంతికి ఇంటికి వచ్చిన తర్వాత ఈనెల 19వతేదీన గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక మామిడి తోటలో పురుగు మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బంధువులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు, మద్యానికి బానిసవడం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత..


ఆత్మహత్యకు పాల్పడిన ఆదిలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గరుగుబిల్లి ఆదిలక్ష్మి (32) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. తరచూ కడుపునొప్పి రావడంతో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కొన ఊపిరితో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి సూరప్పడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక లారీడ్రైవర్..


ఆత్మహత్యకు పాల్పడిన దేముళ్లు

లక్కవరపుకోట: అప్పుల బాధలను తట్టుకోలేక మండలంలోని రేగ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ నెక్కల దేముళ్లు (44) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేముళ్లు ఇటీవల గ్రామంలోను ఇతర ప్రాంతాల్లో అప్పులు చేసి మద్యానికి బానిసయాడు. ఈ క్రమంలో సంక్రాంతికి డ్యూటీ దిగి గ్రామానికి వచ్చాడు. కుటుంబంతో గడిపి మంగళవారం ఉదయం పశువుల కళ్లానికి వెళ్లివస్తానని చెప్పి కళ్లంలో గల చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. బంధువులు కొంత మంది కళ్లంలోకి వెళ్లి చూసేసరికి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని చెట్టు నుంచి దింపి ఎస్.కోట సీహెచ్‌సీకి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. మృతుడికి 5వ, 3వ తరగతులు చదువుతున్న బాబు, పాప ఉన్నారు.

చెట్టుకొమ్మ పడి యువకుడి మృతి


ఏడువాక శేఖర్ మృతదేహం

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ దిబ్బలపాలెంలో యువకుడిపై చెట్టు కొమ్మ పడడంతో వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి వల్లంపూడి ఎస్సై బి.దేవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం కళ్లంపూడి గ్రామానికి చెందిన ఏడువాక శేఖర్ (25) చెట్లు నరికివేత కూలిపని చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం ప్రతి రోజూలాగానే కేజీపూడి పంచాయతీ దిబ్బపాలెంలో చెట్లు నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మ మీద పడడంతో గాయాలపాలయ్యాడు. వెంటనే కేజీపూడిలో ఉన్న వెల్‌నెస్ కేంద్రానికి తీసుకెళ్లేసరికి అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుడు తల్లి ఏడువాక లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టానికి మృతదేహాన్ని తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి తండ్రి కృష్ణ ఉన్నాడు.

సర్వే సిబ్బంది సామూహిక సెలవు


సంఘ కార్యాలయం వద్ద సర్వే ఉద్యోగుల నిరసన

- స్తంభించిన రీ సర్వే సమస్యల నవరణ క్రియ

విజయనగరం అర్బన్: సర్వే ఉద్యోగుల సంఘం నాయకుడిపై ఇచ్చిన సరెండర్ ఆదేశాలను వెనుకకు తీసుకోవాలని, ఉద్యోగులకు ఇచ్చిన మెమోలను రద్దు చేయాలని కోరుతూ సర్వే శాఖ సిబ్బంది మంగళవారం సామూహిక సెలవుపెట్టారు. విధుల బహిష్కరించి ఉన్నతాధికారుల వేధింపులపై నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మండల, విలేజ్, సచివాలయ సర్వేయర్లు, టెక్నికల్ స్టాఫ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు దాదాపు 485 మంది విధులు బహిష్కరించారు. దీంతో జిల్లాలో సర్వే శాఖ పనులు క్షేత్రస్థాయిలో స్తంభించాయి. సంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన అత్యవసర సమావేశానికి భారీ సంఖ్యలో సర్వే ఉద్యోగులు హాజరై నిరసన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల తీరుకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా పలువురు సర్వే సిబ్బంది మాట్లాడుతూ సంఘ అధ్యక్షుడు చౌదరి వెంకట్రావు సరెండర్ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, మండల సర్వేర్లకు ఇచ్చిన మెమోలను, ఇద్దరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లకు, ఐదుగురు సర్వేయర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను రద్దు చేసే వరకు సామూహిక సెలవుల రూపంలో విధులు బహిష్కరిస్తామని ప్రకటించారు. పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా సంఘం కమిటీలు మా నిరసనకు మద్దతుగా నల్లబ్యాడ్జీలతో విధులు నిర్వహించారన్నారు. సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి మద్దతు వస్తుందని హెచ్చరించారు. జిల్లాలోని వీఆర్వోల సంఘం, ఏపీఎన్‌జీఓ సంఘాలు మద్దతు అడగడం జరిగిందని తెలిపారు. అనంతరం వినతి పత్రాలను ఉన్నతాధికారులకు పంపామని ప్రకటించారు.

వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామునాయుడు


రామునాయుడికి పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరావు

వేపాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చినగుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడిని నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం వేపాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గాన్ని ఆర్థిక, సామాజిక విభిన్నరంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అలాగే ఉపముఖ్యమంత్రి పదవి వెలమవర్గానికి ఇవ్వాలని, జనాభా దామాషా ప్రకారం వెలమ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మే నెలలో విశాఖ వేదికగా జరగబోయే వెలమ గర్జనలో లక్షలాదిమంది పాల్గొనేలా జిల్లా అధ్యక్షులు కృషిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రామునాయుడు మాట్లాడుతూ వెలమ సంఘం సంక్షేమ అభివృద్ధి, వెలమకులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పూసపాటిరేగ: మండలంలోని సీపీ ఆక్వా పరిశ్రమ సమీపంలో ఆగి ఉన్న లారీని మోటార్ సైకిల్‌తో ఢీకొట్టిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన ఉమామహేశ్వర్రావు పూసపాటిరేగ మీదుగా స్వగ్రామం బెజ్జిపురం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మంగళవారం రాత్రి సీపీ ఆక్వాపరిశ్రమ సమీపంలో జాతీయరహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ విద్యార్థి అదృశ్యం


అదృశ్యమైన ఉత్కర్ష్ మోహన్ భాసర్‌కర్

విజయనగరం క్రైమ్: కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఉత్కర్ష్ మోహన్ భాసర్‌కర్ అనే 13 ఏళ్ల విద్యార్థి అదృశ్యమైనట్లు స్కూల్ ఉపాధ్యాయులు ఫి ర్యాదు చేశారని రూరల్ పోలీసులు మంగళవారం తెలి పారు. ఈ నెల 19న హైదరాబాద్ నుంచి విజయనగరం రైల్లో వచ్చాడని, మధ్యాహ్నం 1 గంటకు విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించిందని, అయినప్పటికీ స్కూల్‌కి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరికైనా బాలుడి ఆచూకీ తెలిస్తే ఫోన్ 9121109441, 91211094 27 నంబర్లను సంప్రదించాలని కోరారు. సైనిక్ స్కూల్ ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ తెలిపారు.

ఏడాది కష్టం ఆహుతి

- 8 మంది రైతుల ధాన్యం దగ్ధం
- రూ.4లక్షల మేర ఆస్తినష్టం


బుగ్గిపాలైన ధాన్యం వద్ద దీనంగా రైతులు

శృంగవరపుకోట: ఆరుగాలం కష్టపడిన రైతన్నల కష్టం అగ్గిపాలైంది. రైతులు ధాన్యపు సిరులను దాచుకున్న పురులను అగ్నిదేవుడు స్వాహా చేశాడు. శృంగవరపు కోట మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కిలారి శ్రీను, కిలారి కుమార్, ఈశ్వరరావు, అప్పలనాయుడు, సన్నిబాబు, కాసులమ్మ, ఈశ్వరమ్మ, భవానీలు నూర్పు చేసి, గ్రామానికి సమీపంలో ఉన్న తమ కళ్లాల్లో పురులు కట్టి ధాన్యం నిల్వ చేశారు. కాగా సోమవారం అర్ధరాత్రి 1గంట సమయంలో ధాన్యం పురులకు నిప్పు అంటుకుని మంటలు ఎగిశాయి. దారిన పోతున్న వారు మంటలు చూసి మామిడిపల్లి గ్రామం వద్దకు వెళ్లి కేకలు వేసి గ్రామస్తులను లేపి విషయం చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన రైతులు వెంటనే అగ్నిమాపకశాఖకు ఫోన్ చేసి కళ్లానికి పరుగులు తీసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పురుల్లో ఉన్న ధాన్యం కాలిపోయాయి. ఒక్కో ధాన్యం పురిలో 30 నుంచి 40 బస్తాల ధాన్యం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. సుమారు రూ 4.లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా మామిడిపల్లి గ్రామంలో జరిగిన దుర్ఘటనలో ఎంత మేర పంటనష్టం వాటిల్లిందని మంగళవారం సాయంత్రం మండల వ్యవసాయాధికారి రవీంద్రను వివరణ కోరగా స్వల్ప అగ్నిప్రమాదం జరిగిందని, గడ్డిమోపు కాలినట్లు ఏఈఓ అప్పలనాయుడు చెప్పారు.

స్కాన్‌యూలో అరుదైన వైద్యపరీక్ష


గర్భిణి నుంచి సేకరించిన ఉమ్మనీటిని చూపిస్తున్న డాక్టర్ కె.సాధన

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఒకవైపు అల్ట్రా సౌండ్ స్కాన్ చేస్తూనే మరోవైపు సూది ద్వారా ఓ గర్భిణి ఉమ్మనీటిని సేకరించి గర్భస్త శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించడమనే అరుదైన వైద్యపరీక్షను యువ రేడియాలజిస్ట్ డాక్టర్ కె.సాధన విజయవంతంగా నిర్వహించారు. విజయనగరం కోట జంక్షన్‌లో ఉన్న స్కాన్‌యూ ల్యాబ్‌లో ఆమె మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. ప్రఖ్యాత రేడియాలజీ కళాశాల స్టాన్లీలో విద్యాభ్యాసంతో పాటు ఫీటల్ మెడిసిన్‌లో అడ్వాన్స్ కోర్సు చేయడం ఈ వైద్యపరీక్షకు ఎంతో ఉపకరించాయని చెప్పారు. గర్భస్థ శిశువుకు జన్యుపరమైన, శారీరక లోపాలను గుర్తించడానికి సాధారణంగా గర్భం దాల్చిన తర్వాత ఏడో నెలలో వైద్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఆ సమయంలో లోపాలు ఏమైనా గుర్తిస్తే గర్భవిచ్ఛిత్తికి, ప్రసవానికి కష్టమవుతుందని, ఒక్కోసారి బిడ్డతో పాటు తల్లి ప్రాణాలకూ ప్రమాదమవుతుందని వివరించారు. అలాగాకుండా మూడో నెలలోనే గర్భిణికి అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తూ మరోవైపు సూది ద్వారా ఉమ్మనీరు సేకరించి పరీక్షించడం ద్వారా ఆ ప్రమాదాన్ని తప్పించవచ్చన్నారు. 15 నుంచి 18 వారాల గర్భిణికి ఈ వైద్య పరీక్ష కచ్చితంగా చేయిస్తే మంచిదని చెప్పారు. గర్భస్థ శిశువుకు ఏమైనా లోపాలున్నట్లు గుర్తిస్తే వైద్యుల సూచనలతో సరిచేసేందుకు, వీలుగాకపోతే తొలగించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ తరహా వైద్య పరీక్షలకు హైదరాబాద్, బెంగళూరు వ్యయప్రయాసలకోర్చి వెళ్లేవారని, ఇప్పుడు విజయనగరంలోనే అందుబాటులోకి వచ్చినట్టు ఆమె చెప్పారు.

జాతీయ స్థాయి కార్యక్రమంలో మోడల్ స్కూల్ విద్యార్థిని


విద్యార్థిని ఏక్తాను అభినందిస్తున్న డీఈఓ మాణిక్యం నాయుడు

గంట్యాడ: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ పరీక్షాపే చర్చ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో గంట్యాడ మండంలోని మదనాపురం మోడల్ స్కూల్ చెందిన ఎల్. ఏక్తా అనే విద్యార్థిని కూడా పాల్గొందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ముంబైలో జరిగిన సదస్సులో అంచనాల నిర్వహణ, కాల్పనికత, వాస్తవికతకు తేడా అనే అంశంపై తమ పాఠశాల విద్యార్థిని చర్చించిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణారావు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని రకాల పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని గైడ్ టీచర్స్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. జాతీయ సదస్సులో పాల్గొన్న విద్యార్థిని ఏక్తాను డీఈఓ మాణిక్యం నాయుడు మంగళవారం అభినందించారు.

ఏయూ మహిళా క్రికెట్ జట్టుకు విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల కరెస్పాండెంట్ వై.శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టులో పట్టణంలోని ధర్మపురిలో గల శ్రీలక్ష్మీగణపతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు కె.హారిక, పి.వెన్నెల మోహన, కె.దివ్యశ్రీ ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల కరెస్పాండెంట్ వై.శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు మైసూర్ విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ మండలి (సౌత్ జోన్) అంతర్ విశ్వ విద్యాలయాల క్రికెట్ పోటీల్లో ఏయూ మహిళా క్రికెట్ జట్టు తరపున పాల్గొంటారని తెలియజేశారు. కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఎంపికైన క్రీడాకారిణులకు అభినందనలు తెలిపింది.

తూర్పు కాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

- తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా అధ్యక్షుడు ఆంబళ్ల అప్పలనాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: తూర్పుకాపులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని తూర్పు కాపు సామాజిక వేదిక జిల్లా అధ్యక్షుడు అంబళ్ల అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కామాక్షినగర్‌లోని తూర్పుకాపు సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీట్ల కేటాయింపుల్లో కాపులకు ప్రాధాన్యం తగ్గించారని, అయినా కూటమి ప్రభుత్వ విజయానికి కృషి చేశామన్నారు. తూర్పు కాపుల దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులు ఇచ్చి వారి హక్కులను కాలరాయకుండా కాపాడాలని కోరారు. జిల్లాలో అత్యధికంగా తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని, ఎన్నికల్లో ప్రాధాన్య తగ్గించి సీట్లు ఇచ్చినప్పటికీ ఓటు వేసి విజయానికి కృషి చేశామన్నారు. ఈ సారి ఇస్తున్న నామినేటెడ్ పదవులనైనా తూర్పు కాపులకు కేటాయించాలని కోరారు. తూర్పు కాపులను అణగదొక్కే ప్రయత్నం చేయకూడదన్నారు. కార్యక్రమంలోతూర్పు కాపు సామాజిక వేదిక ప్రతినిధులు రొంగలి రామారావు, పత్తిగిల్లి రామారావు, గెరిడి అప్పలనాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, ముదిలి నాగభూషణం, తరుణవంకుశం పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరు నిందితుల అరెస్టు

కొత్తవలస: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కొత్తవలస సీఐ జి.రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 27 మద్యం సీసాలతో పట్టుబడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వేపాడ మండలం బల్లంకి గ్రామంలో ఎం.రాము 12 మద్యం సీసాలు, లక్కవరపుకోట మండలం సీతారాంపురం గ్రామంలో తూర్పాటి గంగ అనే మహిళ వద్ద 15 మద్యం సీసాలు తనిఖీల్లో పట్టుబడినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఇద్దరి పైన కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు ఎస్.రమ్యశ్రీ, వీఎస్.రాజు,సిబ్బంది బి.రాముడు, బి.ఆదినారాయణ, జి.రమేష్, వి.పుష్పలతలు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: సీపీఎం 29వ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1,2,3 న నెల్లూరు జిల్లాలో జరుగుతున్నాయి ఈ మహాసభల సందర్భంగా సీపీఎం విశిష్టత గురించి వాడవాడలా ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా మంగళవారం స్థానిక రామకృష్ణనగర్‌లో సీపీఎం ప్రచారాన్ని ప్రారంభించారు. అందుకుముందు జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శాంతమూర్తి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.